# వ్యక్తిని కిడ్నాప్ చేసి బెదిరింపులు రూ. లక్ష ఇవ్వాలని కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన దుండగులకు రిమాండ్



**పతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య** ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి లక్ష రూపాయలు ఇవ్వకుంటే చంపేస్తామని కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నగర బహిష్కరణ గురైన ప్రధాన నిందితుడు అసద్ తో కలిసి 7గురు నిందితులను పోలీసులు రిమాండ్ కు తరలించారు. సయ్యద్ మొహియుద్దిన్ స్నేహితుడే అసద్ డబ్బుల కోసం హత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం బాలాపూర్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి , బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సుధాకర్, ఎస్సై ప్రసాద్ తో కలిసి వివరాలు వెల్లడించారు. పాతబస్తీ కాలపత్తర్ కు చెందిన బాధితుడు సయ్యద్ మొహియుద్దీన్ (31) బాలాపూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన కరీం అనే స్నేహితుడు తో కలిసి వ్యాపారం కోసం గోడౌన్ అద్దెకు తీసుకొని నిర్వహిస్తున్నారు. ఈనెల 10న గోడౌన్‌లో తన పనిని పూర్తి చేసిన తర్వాత, ఫిర్యాదుదారుడు, తన కార్మికుడు ముస్తఫాతో కలిసి అలీషాన్ హోటల్ సమీపంలో ఉన్నాడు. ఆ సమయంలో, కాలాపత్తర్ నివాసితులు అయిన రౌడీషీటర్ అసద్ జహంగీర్,


ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులతో కలిసి అతని దగ్గరికి వచ్చారు. అసద్ తనను బెదిరించి, తన ఉద్యోగి ముస్తఫాతో పాటు షాహీన్ నగర్‌లోని సగ్గఫ్ కాలనీకి బలవంతంగా కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. షాహీన్ నగర్‌లోని సగ్గాఫ్ కాలనీకి చేరుకున్న తర్వాత 9 మంది దుండగులు మారణాయుధాలతో బెదిరించి లక్ష రూపాయల డబ్బులు డిమాండ్ చేశారు. ఆ మొత్తం చెల్లించకపోతే చంపేస్తానని కత్తులతో చంపేస్తామని బెదిరించాడు. తన దగ్గర డబ్బు లేదని చెప్పినప్పుడు, అసద్ తన ఎడమ కనుబొమ్మపై , తల వెనుక భాగంలో కత్తితో దాడి చేశాడు. దీనితో గాయాలు అయ్యాయి. ఆ వ్యక్తులందరూ చేతులు కర్రలతో తనను కొట్టి శారీరకంగా దాడి చేశారని, ఫలితంగా అతని శరీరంపై అనేక గాయాలు అయ్యాయని అతను చెప్పాడు. తన పర్సులో ఉన్న నగదును బలవంతంగా లాక్కున్నారని కూడా అతను చెప్పాడు. 11న ఉదయం 11:30 గంటలకు నొప్పిని భరించలేక అతను బిగ్గరగా అరిచాడు, దీంతో ఆ వ్యక్తులందరూ అక్కడి నుండి పారిపోయారు. ఆపై చికిత్స కోసం మల్లాపూర్‌లోని రికవరీ ఆసుపత్రికి వెళ్లాడు. చట్ట ప్రకారం అవసరమైన చర్య తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రధాన నిందితుడైన అసద్, జహంగీర్, నవాజ్, సయ్యద్, ఆల్తాఫ్ , బసరాభి, ఇక్బాల్ మొహియుద్దిన్ లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. పైసల్, ఇమ్రాన్ పరార్ లో ఉన్నారని త్వరలోనే వారిని పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

**పాతబస్తీ కాలపత్తర్ కు చెందిన రౌడీషీటర్ అసద్ పై 15 కేసులు:**

కాలపత్తర్ పోలీస్ స్టేషన్లో 9 కేసులు ఉన్నట్లు, శాలిబండ రెండు కేసులు, బండ్లగూడలో 1, సిరికొండలో 2 నిజాంబాద్ లో 1 కేసు మొత్తం 15 కేసులు ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. అతనిపై నగర బహిష్కరణ ఉన్నట్లు కూడా తెలిపారు. అతనిపై మిగతా వారిపై పిడి ఆక్ట్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎ 2 ఫయూజ్ ఖాన్ పై 5 కేసులు, ఎ 3 మొహమ్మద్ ఇమ్రాన్ పై 13 కేసులో ఉన్నట్టు తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని. ఇటువంటి దుండగులను ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరించారు. వారి నుంచి 6 సెల్ ఫోన్లు, 4 వేట కొడవళ్ళు, ఒక గొడ్డలి, రెండు ద్విచక్ర వాహనాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఎర్రకుంట ఎఫ్ టీ ఎల్ లో నిర్మించిన ప్రహరీ గోడను కూల్చివేసిన రెవెన్యూ అధికారులు





**ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య** ప్రభుత్వ భూములు, ఎఫ్ టీ ఎల్ ప్రాంతాలను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే, అనుమతి లేకుండా నిర్మాణాలు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని బాలాపూర్ తహసిల్దార్ ఇందిరాదేవి అన్నారు. బాలాపూర్ మండలం ఎర్రకుంటలోని మినార్ కాలనీలో ఎర్రగుంట చెరువు సర్వే నెంబర్ 161 లో ఎఫ్ టీ ఎల్ లో మట్టిని నింపి వెంచర్ ఏర్పాటు చేశారు. గత సంవత్సర క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్ కూడా ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు ప్రస్తుతం అక్రమంగా ఎఫ్ టీ ఎల్ లో నిర్మించిన ప్రహరీ గోడను, పర్మిషన్ లేకుండా వెంచర్ చేసి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సమయంలో బాలాపూర్ తహసిల్దార్ ఇందిరాదేవి ఆదేశాల మేరకు ఆర్ ఐ జమీల్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి ఆక్రమించిన ప్రహరీ గోడను, నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను జేసీబీ తో కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు , ఎఫ్ టీ ఎల్ ప్రాంతాలను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. వారి పైన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపం

**చిగురింత నర్సింహారెడ్డి**



**ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య** అన్నం పరబ్రహ్మ స్వరూపమని, దైవాంశ సంభూతమని, ప్రాణకోటికి ఆధారమని, అన్నం లేకపోతే జీవనమే సాధ్యం కాదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని బాలాపూర్ డివిజన్ లో గల శివ్ జీ మహారాజ్ దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా శివ పార్వతుల కల్యాణం నిర్వహించిన నేపథ్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆలయ పూజారి దుర్గ ప్రసాద్ ని కమిటి సభ్యులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచభూతాల సమ్మేళనమైన అన్నాన్ని గౌరవించడం, అవసరమైన వారికి దానం చేయడం పుణ్య ప్రదమని, అన్నారు. వృధా చేయకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, నాయకులు బాలింగని జంగయ్య, టేకుల సుధాకర్ రెడ్డి , కమిటి సభ్యులు ఛైర్మన్ టేకుల శశిధర్ రెడ్డి, డైరెకర్లు ఇక్కే శ్రీను, కళ్ళెం శ్రీధర్ రెడ్డి, పగడాల ఉమేష్, కోలన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మారుమ్రోగిన శైవక్షేత్రాలు





**ప్రతిఘటన, చాంద్రాయణగుట్ట రిపోర్టర్ శైలేష్** హరహర మహాదేవ..!శంభో శంకర అంటూ.. శివనామస్మరణతో శైవ క్షేత్రాలు మారు మ్రోగాయి. ఆదివారం మహాశివరాత్రిని పురస్కరించుకొని పూల్ బగ్ చమాన్ సమీపంలో ఉన్న న్యూ శివ హనుమాన్ శివాలయాలకు భక్తులు పోటెత్తారు తెల్లవారుజాము నుంచే శివలింగానికి అభిషేకాలు, పూజలు, అర్చనలు చేసి ఉపవాస దీక్షలు చేపట్టారు. స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. పలు ఆలయాల్లో శివ పార్వతి పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. సోమవారం స్వామి వారిని దర్శించుకొని అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ఉపవాస దీక్షను విరమించుకున్నారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నా వారిలో ఆలయ చైర్మన్ సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఎక్క సాయి కిరణ్, శ్రీకాంత, లక్ష్మీకాంత్, సాయి, రాజు, రవి, కృష్ణ గురు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మాటిచ్చి మోసం చేశారు

**కౌన్సిల్ హాలులో కంట తడి పెట్టిన కౌన్సిలర్ గంజి శ్రీవాణి గణేష్ రెడ్డి**

**ఓసీ,బీసీ, లోకల్, నాన్ లోకల్ వైరుద్యాలు ఎందుకు అంటూ ఎమ్మెల్యే ను నిలదీసిన శ్రీవాణి**

**తమ గ్రామం విలీనం అయ్యాక దూరం సృష్టిస్తూ రాజకీయాలు ఏంటి మాకు అర్హత లేదా అంటూ ఆవేదన**



**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్ :** భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాటిచ్చి మోసం చేసారంటు.. కౌన్సిల్ హాలులో భువనగిరి 11వ వార్డు కౌన్సిలర్ గంజి శ్రీవాణి గణేష్ రెడ్డి కంట తడి పెట్టింది. తమ గ్రామం విలీనం అయ్యాక దూరం సృష్టిస్తూ రాజకీయాలు ఏంటని.. మాకు అర్హత లేదా.. అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఓసీ,బీసీ, లోకల్, నాన్ లోకల్ వైరుద్యాలు ఎందుకు అంటూ ఎమ్మెల్యే ను నిలదీసింది. చదువుకున్న వారికి అవకాశం ఇవ్వాలని అనర్హులకు అవకాశం ఇవ్వడం కులాల పేరుతో తొక్కేస్తే ఎలా అని ప్రశ్నించింది. మొదటి నుండి చైర్ పర్సన్ పదవి ఇస్తానని మాట ఇచ్చి ఇప్పుడు 35వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన తంగెళ్ళపల్లి శ్రీవాణి ని ఎన్నుకోవడంపై గంజి శ్రీవాణి నిండు కౌన్సిల్లోనే కంటతడి పెట్టుకున్నారు. జనరల్ స్థానంలో కూడా రెడ్డి సామాజిక వర్గానికి అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి నుండి 11 వ వార్డు కౌన్సిలర్ గంజి శ్రీవాణి కే అధ్యక్ష పీఠం అని ప్రచారం జరిగిన చివరి నిమిషంలో అంచనాలు అన్ని తారుమారయ్యాయి.

## ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు పూర్తి

**యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్ :** రెండవ సాధారణ మున్సిపాలిటీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో మీరు చూపిన క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం ప్రశంసనీయం. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో మీ సేవలు అమూల్యమైనవి. భవిష్యత్తులో కూడా ఇలాంటి బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు.

## బీజేపీ కౌన్సిలర్లకు సన్మానం




**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్ :** భువనగిరి మున్సిపాలిటీకి ఎన్నికైన బీజేపీ కౌన్సిలర్ లను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముట్కూరి అశోక్ గౌడ్ సోమవారం జిల్లా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం అధ్యక్షతన 5 వ వార్డ్ తుమ్మల యాస్మిన్ నగేష్ ,16 వ వార్డ్ భోజన శారద, 19 వ వార్డ్ బండారు స్వర్ణలత, 21 వ వార్డ్ వంగేటి సుచరిత భాస్కర్ లను సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలలో బీజేపీ తరపున అందరూ మహిళలే ఎన్నికవ్వడం చాలా సంతోషకరమైన విషయమని, పట్టణంలోని వార్డు సమస్యలపై తమ వాని వినిపిస్తూ ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, సురవి శ్రీనివాస్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కోళ్ల బిక్షపతి, ఆకుతోట రామకృష్ణ, మంగు నరసింహారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కృష్ణచారి, కొలిచేలిమ మల్లికార్జున్, ఎదగాని సంతోష్, సాయి కిరణ్, ప్రవీణ్, మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అఖండజ్యోతి యాత్ర ప్రతిమని సింహద్వారం వద్ద ప్రతిష్టించాలి



**ప్రతిఘటన, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో రిపోర్టర్ జంగిటి రవీందర్ :** అఖండజ్యోతి యాత్ర ప్రతిమని సింహద్వారం వద్ద ప్రతిష్టించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు దూశెట్టి పవన్ కుమార్, బజరంగ్దళ్ మండల కన్వీనర్ సట్టు రవీందర్ లు దేవస్థాన కార్యనిర్వానాధికారిని వినతి పత్రంలో కోరారు. గత 32 సంవత్సరాలుగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకై స్వామి వారి అఖండజ్యోతి యాత్ర బర్కత్ పుర లోని యాదగిరి భవన్ నుంచి మొదలవుతుందని చెప్పారు. జ్యోతి యాత్ర స్వామివారి బ్రహ్మోత్సవాల మొదటి రోజు యాదగిరిగుట్ట చేరుకుంటుందని ఈ జ్యోతి యాత్ర వెంట స్వామివారి ప్రతిమ తీసుకురావడం జరుగుతుందని ప్రతిమని స్థలాభావం వల్ల చెరువులో నిమజ్జనం చేస్తారని ఈసారి వచ్చే ప్రతిమని సింహద్వారం వద్ద ప్రతిష్టించగలరని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏకాదశి, ప్రతి శనివారం, స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి రోజు, ప్రతిరోజు కూడా ఎంతో మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తూ ఉంటారని ఉద్యోగరీత్యా, వ్యాపారిత్య గిరి ప్రదక్షిణ అనంతరం స్వామివారి దర్శనం చేసుకోకుండానే తమ తమ విధులకు స్థానికులు, యాత్రికులు వెళ్తున్నారని వారి సౌకర్యార్థం సింహద్వారం వద్ద ప్రతిష్టించి భక్తులకి సౌకర్యవంతం చేయాలని పేర్కొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలి

**మిల్కీ కిడ్స్ స్కూల్ డైరెక్టర్ మహమ్మద్ బషీర్ ఖాన్**




**ప్రతిఘటన, మహేశ్వరం, రిపోర్టర్ ముత్తయ్య** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, ప్రణాళికాబద్ధంగా చదివి ప్రయోజకులు కావాలని మంచి చెడులను గ్రహించి, క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారానే సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలరని, స్కూల్ డైరెక్టర్ మహ్మద్ బషీర్ ఖాన్, ప్రిన్సిపల్ మహ్నాజ్ తస్మియా ఖాటూన్ అన్నారు. మిల్కీ కిడ్స్ స్కూల్ తన వార్షికోత్సవం గ్రాడ్యుయేషన్ వేడుకను జిల్లేలగూడ కంచన్ బాగ్ శాఖలో నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మీర్ పేట్ మున్సిపల్ మాజీ మేయర్ దుర్గా దీప్లాల్ చౌహాన్, బీఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, రేఖ లక్ష్మణ్ ముదిరాజ్, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఇ. అజయ్ కార్తీక్ వేడుకలకు హాజరయ్యారు. ఈ వేడుకలో చిన్నారులు చేసిన నృత్యాలు, సంగీత ప్రదర్శనలతో విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రుల ఉత్సాహం అంకితభావం స్పష్టంగా కనిపించిందన్నారు. ఇది సమగ్ర అభివృద్ధికి పాఠశాల యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. ఎదుగుదలను ప్రోత్సహిస్తూ, వారిని ఉజ్వల భవిష్యత్తుకు సిద్ధం చేస్తోందన్నారు. గ్రాడ్యుయేషన్ వేడుక ఒక ప్రధానాంశం, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు తమ సర్టిఫికెట్లు మెడల్స్ అందుకున్నారు. ఇది వారి ప్రారంభ విద్య ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయని తెలిపారు. విద్యార్థుల కష్టానికి, ఉపాధ్యాయుల అంకితభావానికి, తల్లిదండ్రుల మద్దతుకు ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. మిల్కీ కిడ్స్ స్కూల్ పిల్లలకు ఒక పెంపక వాతావరణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ,విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

